www.kalamdaily.com
కలం
ప్రజల గళం...
Follow on: Kalamtelugu
17-02-2026, మంగళవారం

360°


# SINGLE PAGE TOPIC
## ప్రత్యూష డెత్ మిస్టరీ



రంగురంగుల లోకంలో కదిలే తన బొమ్మను
చూసి మురిసిపోయింది ఆ తార!
16 ఏండ్లకే సినిమా ఇండస్ట్రీకి వచ్చి..
చిన్న చిన్న క్యారెక్టర్లతో ప్రస్థానాన్ని ప్రారంభించి..
రెండేండ్లకే హీరోయిన్‌గా ఎదిగింది.
సిల్వర్ స్క్రీన్‌పై చెరగని ముద్ర వేసుకుంది.
ఎందరో అభిమానులను సొంతం
చేసుకుంది. తను కలలు కన్న
ప్రపంచం తన కండ్ల ముందు
కదలాడుతుండగానే..
20వ ఏట అర్ధాంతరంగా
తనువు చాలించింది.
ఆత్మహత్య చేసుకుందన్న పుకార్లు!
లేదు.. అది హత్య, రేప్ అనే అనుమానాలు!!
24 ఏండ్లవుతున్నా అంతుచిక్కని
విషాదాంతం. ఆ తార ప్రత్యూష..
తెలంగాణ బిడ్డ! ఇప్పటికీ ఆమె తల్లి
సరోజినీదేవి ఒంటరిగా న్యాయపోరాటం
చేస్తున్నారు. సుప్రీంకోర్టు వరకు వెళ్లారు.
నిందితుడు సిద్ధార్థరెడ్డిని
లొంగిపోవాల్సిందేనని తాజాగా
అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.
ప్రత్యూష విషాదాంతంపై కలం 360 డిగ్రీస్..


- తెలంగాణ బ్యూరో, కలం

### స్వస్థలం భువనగిరి



ప్రత్యూష పుట్టి పెరిగింది భువనగిరిలో. ఆమె తల్లి సరోజినీ దేవి టీచర్. తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. భువనగిరిలో స్కూల్ ఎడ్యుకేషన్, హైదరాబాద్‌లో ఇంటర్ వరకు చదువుకుంది.

### మిస్ లవ్లీ స్మైల్ టైటిల్‌తో



ఇంటర్ చదువుతున్నప్పుడు జరిగిన 'మిస్ లవ్లీ స్మైల్' అందాల పోటీలో ప్రత్యూష టైటిల్ నెగ్గింది. చిన్నప్పటి నుంచే సినిమా ఇండస్ట్రీలో అడుగుపెట్టాలని కలలు కన్న తనకు ఈ టైటిల్ అవకాశాలను తెచ్చిపెట్టింది. అలా 1998లో మోహన్ బాబు హీరోగా వచ్చిన 'రాయుడు' సినిమాలో రాణి క్యారెక్టర్‌తో టాలీవుడ్‌లోకి ఆమె ఎంట్రీ ఇచ్చింది.

### శ్రీదేవికి వీరాభిమాని



ప్రత్యూషకు సినిమాల్లోకి రావాలన్న ఆలోచన శ్రీదేవిని చూసి వచ్చింది. శ్రీదేవి వినయం, అభినయం అంటే ప్రత్యూషకు చాలా ఇష్టం. సినిమాల్లోకి వచ్చే ముందు.. వచ్చిన తర్వాత కూడా శ్రీదేవినే తను ఫాలో అయ్యేది. ఆమెలా నటించాలని, ఆమెలా మెప్పించాలని.. ఆమెలా పేరు తెచ్చుకోవాలని కలలు కనేది. ఆ ప్రయత్నంలోనే పలు చిత్రాల్లో నటించింది. కెరీర్ పీక్స్‌లోకి వెళ్తున్న టైమ్ లోనే సినీవినీలాకాశం నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయింది.

# ప్రత్యూష విషాదాంతం
# అలుపెరుగని అమ్మ పోరాటం

**సితారలా ఎదిగి 20వ ఏటనే రాలిన తెలంగాణ బిడ్డ.. 24 ఏండ్లు దాటుతున్నా వీడని మిస్టరీ**

## ఆ రోజు ఏం జరిగింది?

**2002 ఫిబ్రవరి 23న విషం తాగిన స్థితిలో ప్రత్యూష ఆస్పత్రిలో చేరగా.. ఆ మరుసటి రోజు మరణించింది. అసలు ఆ రోజు ఏం జరిగిందనేది ఇప్పటికీ మిస్టరీనే.**

- ''అది 2002 ఫిబ్రవరి. ప్రత్యూషకు కన్నడ సినిమాలో తొలిసారి అవకాశం వచ్చింది. ఫిబ్రవరి 24న బెంగళూరుకు వెళ్లాల్సి ఉంది. అంతకుముందు రోజు (ఫిబ్రవరి 23) సాయంత్రం ఫేషియల్, వ్యాక్సింగ్ చేయించుకోవడం కోసం కజిన్ సిరితో కలిసి ప్రత్యూష బ్యూటీపార్లర్‌కు వెళ్లింది. అక్కడికి సిద్ధార్థ రెడ్డి వచ్చాడు. అతని కారులో ఓ 15 నిమిషాలు రైడ్‌కు వెళ్లి వస్తానని, బ్యూటీ పార్లర్ దగ్గర వెయిట్ చేయమని సిరికి ప్రత్యూష చెప్పింది. కొంతసేపటికి నాకు ఫోన్ చేసింది. 'జయం సినిమాలో హీరోయిన్‌గా కన్‌ఫర్మ్ చేసినట్టు తేజ ఆఫీసు నుంచి ఫోన్ వచ్చింది. వాళ్ల ఆఫీసుకు వెళ్లి వస్తాను' అని చెప్పింది. ఇక ఆ తర్వాత నుంచి ఎలాంటి ఫోన్ లేదు. నిజానికి ప్రత్యూష, సిద్ధార్థ రెడ్డి తేజ ఆఫీసుకు వెళ్లనేలేదు. ఆ తర్వాత ఏం జరిగిందనేది అంతా మిస్టరీగానే మిగిలిపోయింది'' అని ప్రత్యూష తల్లి సరోజినీ దేవి పలు ఇంటర్వ్యూల్లో వెల్లడించారు.
- అప్పట్లో మీడియాలో వచ్చిన కథనాల ప్రకారం.. 2002 ఫిబ్రవరి 23న సాయంత్రం ఐదారు గంటల మధ్యలో బ్యూటీ పార్లర్ నుంచి ప్రత్యూషను సిద్ధార్థ రెడ్డి తన కారులో తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఓ షాపులో పురుగుల మందు కొనుగోలు చేసి, దాన్ని కూల్‌డ్రింక్ లో కలుపుకుని తాగారు. ఇద్దరూ అపస్మారక స్థితిలో రాత్రి 7:30 గంటల మధ్య బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్‌కు చేరుకున్నారు. అక్కడ ట్రీట్‌మెంట్ పొందుతూ ప్రత్యూష మరుసటి రోజు మరణించగా, సిద్ధార్థ కొన్ని రోజులకు కోలుకుని డిశ్చార్జ్ అయ్యాడు.



# సిద్ధార్థరెడ్డి.. లొంగిపో
## సుప్రీంకోర్టు ఆదేశం

సినీ నటి ప్రత్యూష మృతి కేసులో నాలుగువారాల్లో పోలీసుల ముందు లొంగిపోవాల్సిందేనని నిందితుడు సిద్ధార్థరెడ్డికి సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సిద్ధార్థ రెడ్డి పిటిషన్ ను డిస్మిస్ చేసింది. నటి ప్రత్యూష 2002 ఫిబ్రవరి 24న మృతి చెందింది. ఫ్రెండ్ సిద్ధార్థ రెడ్డితో కలిసి పురుగుల మందు తాగి మృతి చెందినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రత్యూష మృతిచెందగా సిద్ధార్థ రెడ్డి కోలుకున్నారు. తొలుత ఇది ఆత్మహత్యాయత్నమంటూ ప్రచారం జరిగినా అనుమానాలు వ్యక్తమయ్యాయి. పోస్టుమార్టం నివేదికలో ఆమె మెడ ఎముక విరిగిందని, శరీరంపై కొన్ని గాయాలు ఉన్నాయని తేలడం ఈ అనుమానాలకు బలం చేకూర్చినట్లయింది. దీని వెనుక రాజకీయ నాయకుల కుమారులు ఉన్నారనే పుకార్లు అప్పట్లో బలంగా వినిపించాయి. ప్రత్యూష ఆత్మహత్య చేసుకుని చనిపోలేదని, హత్య అని తల్లి సరోజినీ దేవి వాదించారు. మృతి ఘటనపై పోలీసులు ఆత్మహత్యాయత్నం కింద కేసు నమోదు చేసినా ప్రజాసంఘాల ఒత్తిడితో పాటు తల్లి ఆరోపణలతో కోర్టుల్లో విచారణ జరిగింది. సిటీ సివిల్ కోర్టు 2004లో సిద్ధార్థ రెడ్డికి ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించింది. సిద్ధార్థ రెడ్డి హైకోర్టును



సిద్ధార్థరెడ్డి

ఆశ్రయించడంతో ఆ శిక్ష రెండేళ్లకు తగ్గింది. శిక్ష తగ్గించడాన్ని సవాల్ చేస్తూ ప్రత్యూష తల్లి సరోజినీ దేవి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శిక్షను పూర్తిగా కొట్టివేయాలంటూ సిద్ధార్థ రెడ్డి కూడా సుప్రీంకోర్టును కోరారు. ఈ కేసును పరిశీలించిన తర్వాత ఐదేళ్ల శిక్షను రెండేండ్లకు తగ్గించేలా హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. సిద్ధార్థ రెడ్డి లొంగిపోయి శిక్ష అనుభవించాలని తాజాగా జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్‌మోహన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చింది.



## న్యాయం జరగలేదు..

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్న.. కానీ నాకు మాత్రం న్యాయం జరగలేదు. ప్రత్యూషపై అత్యాచారం జరిగింది. మునిస్వామి రిపోర్టును కోర్టులు ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదు? ప్రత్యూషను గ్యాంగ్ రేప్ చేసి చంపారని రిపోర్టులో స్పష్టంగా ఉంది. సిద్ధార్థ రెడ్డికి జీవిత ఖైదు విధించాలి.

**- సరోజినీ దేవి, ప్రత్యూష తల్లి**

తన బిడ్డను చంపిన వాళ్లను వదిలేది లేదంటూ ప్రత్యూష తల్లి సరోజినీ దేవి అలుపెరగని పోరాటం చేస్తున్నారు. టీచర్ అయిన ఆమె.. ప్రత్యూష కెరీర్ ను తీర్చిదిద్దారు. అలాంటిది కన్నబిడ్డ కండ్ల ముందు రాలిపోతే కన్నీళ్లను దిగమింగుకొని.. ధైర్యంగా ముందుకు సాగుతున్నారు.

- 2002 ఫిబ్రవరి 24న విగత జీవిగా పడి ఉన్న తన బిడ్డను చూసి సరోజినీదేవి కడుపు కోత అనుభవించారు. కూతురు డెడ్ బాడీపై ఉన్న గాయాలను గమనించి.. అది ముమ్మాటికీ హత్య, రేప్ అని నమ్మారు. పోలీసులపై నమ్మకం లేక.. నేరుగా అదే ఏడాది కోర్టును ఆశ్రయించారు. ప్రత్యూష మరణం వెనుక రాజకీయ నేతల కుమారుల ప్రమేయం కూడా ఉన్నట్లు పసిగట్టారు.
- అప్పట్లో తల్లి నుంచి, ప్రజా సంఘాల నుంచి వచ్చిన ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వం కేసును సీబీఐకి అప్పగించింది. ఆ తర్వాత హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు ఆమె వెళ్లారు. తన ఉద్యోగం, ఆ తర్వాత రిటైర్మెంట్ తో వచ్చిన డబ్బులతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. 24 ఏండ్లుగా ఆ తల్లిది తీరని శోకం.. ఆగని పోరాటం!!

## ఎప్పుడేం జరిగింది?

**2002 ఫిబ్రవరి 24**
ప్రత్యూష మృతిపై హైదరాబాద్ పంజాగుట్టలోని పోలీస్ స్టేషన్‌లో ఆమె తల్లి సరోజినీ దేవి ఫిర్యాదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు.

**2002 మార్చి 8**
సరోజినీ దేవి పోరాటం, ప్రతిపక్షాల ఒత్తిడితో కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్టు ఆనాటి సర్కార్ ప్రకటన.

**2002 జులై**
ప్రత్యూషను ఆత్మహత్యకు ప్రేరేపించినట్టు నిందితుడు సిద్ధార్థ రెడ్డిపై సీబీఐ చార్జ్‌షీట్.

**2004 ఫిబ్రవరి**
సిద్ధార్థ రెడ్డికి ఐదేండ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ సెషన్స్ కోర్టు తీర్పు.

**2011 డిసెంబర్**
జైలు శిక్షను రెండేండ్లకు తగ్గిస్తూ, జరిమానాను రూ.50 వేలకు పెంచుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు.

**2012**
సుప్రీంకోర్టులో సరోజినీ దేవి, సిద్ధార్థ రెడ్డి వేర్వేరు పిటిషన్లు.

**2025 నవంబర్**
ఇరుపక్షాల వాదనలు విని, తీర్పును రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు.

**2026 ఫిబ్రవరి 17**
పోలీసుల ముందు లొంగిపోవాల్సిందేనని సిద్ధార్థ రెడ్డికి సుప్రీం ఆదేశం.

## నాలుగేండ్లలో 12 సినిమాలు

16 ఏండ్ల వయసులోనే ప్రత్యూష తెలుగు సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టింది. 1998లో 'రాయుడు' సినిమాలో 'రాణి' క్యారెక్టర్‌తో ప్రస్థానం ప్రారంభించింది. తెలుగుతోపాటు తమిళ చిత్రాల్లోనూ నటించింది. జగపతిబాబు హీరోగా తెరకెక్కిన 'సముద్రం' మూవీలో చెల్లిగా కీ రోల్ ప్లే చేసింది. శ్రీరాములయ్య సినిమాలోనూ నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. 2001లో నాగార్జున, ఆయన మేనల్లుడు సుమంత్ కలిసి నటించిన 'స్నేహమంటే ఇదేరా' మూవీలో నాగార్జునకు చెల్లిగా, సుమంత్‌కు జోడీగా ప్రత్యూష నటించింది. కోలీవుడ్‌లో మనునిది, పొన్నాన నేరం వంటి సినిమాల్లో కీలక పాత్రలు పోషించింది. తమిళ చిత్రం 'సౌండ్ పార్టీ'లో ప్రత్యూష నటించగా.. ఈ చిత్రం ఆమె మరణానంతరం విడుదలైంది. నాలుగేండ్ల కెరీర్‌లోనే దాదాపు 12 సినిమాల్లో నటించింది.



## ఉదయ్ కిరణ్‌తో హిట్ జోడీ

2000 సంవత్సరంలో లవర్ బాయ్‌గా టాలీవుడ్‌ను ఏలిన హీరో ఉదయ్ కిరణ్! ఆయనకు మరదలిగా 'కలుసుకోవాలని' చిత్రంలో ప్రత్యూష నటించి మెప్పించింది. ఆ చిత్రంలో ఉదయ్, ప్రత్యూష కాంబినేషన్‌లో వచ్చిన 'చెలియా చెలియా సింగారం.. బావా బావా బంగారం' పాట ఎవర్ గ్రీన్! 2002లో ప్రత్యూష అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆమెకు బావగా 'కలుసుకోవాలని'లో నటించిన ఉదయ్ కిరణ్ 2014లో తనువు చాలించాడు. ఇద్దరిదీ విషాదాంతమే.

## ఎన్నో అనుమానాలు?

- 2002 ఫిబ్రవరి 23న ఉదయం లిఫ్ట్ దగ్గర ప్రత్యూషకు సెండాఫ్ ఇచ్చానని.. ఆ తర్వాత విషాద వార్త తెలిసిందని ఆమె తల్లి సరోజినీ దేవి తెలిపారు. పలు ఇంటర్వ్యూలో నాటి ఘటనను ఆమె గుర్తుచేసుకుంటూ, ఏం జరిగిందో.. ఎవరి ప్రమేయం ఉందో చెప్తూ తన కడుపుకోతకు కారణమైనవాళ్లు శిక్ష అనుభవించక తప్పదని పేర్కొన్నారు.
- ఆసుపత్రిలో ప్రత్యూష స్పృహలోకి వచ్చినప్పుడు ఏదో చెప్పాలని ప్రయత్నించిందని, కానీ డాక్టర్లు ఏదో చేశారని సరోజినీదేవి ఆరోపించారు.
- పోస్ట్‌మార్టం సమయంలో ప్రత్యూష మెడ ఎముక విరిగి ఉండటం, ఆమె దుస్తులు చిరిగిపోయి ఉండటం చూస్తే అది కచ్చితంగా రేప్ అని సరోజినీ అంటున్నారు. "విషం తాగిన వ్యక్తికి మెడ ఎముక ఎలా విరుగుతుంది?" అని ఆమె ప్రశ్నిస్తున్నారు. పోస్టుమార్టం దగ్గర తన కూతురు డెడ్‌బాడీని చూసినప్పుడు మెడ దగ్గర ఎడమ చేతితో బలంగా నొక్కినట్లు గాట్లు కనిపించాయని.. దీనిపై డాక్టర్లను ప్రశ్నిస్తే, ట్రీట్‌మెంట్ సమయంలో ఇలా జరిగిందని తప్పుడు సమాచారం ఇచ్చారని అన్నారు.
- ఈ కేసులో సిద్ధార్థ రెడ్డి మాత్రమే లేడని, అప్పటి కీలక నేతల వారసులు ఉన్నారని సరోజినీదేవి అంటున్నారు. వారిని కాపాడటానికే పోలీసులు, డాక్టర్లు ఏకమై కేసును తప్పుదోవ పట్టించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## కూతురు పేరిట ట్రస్ట్

కూతురు మరణానికి కారణమైన వాళ్లపై పోరాటం చేస్తూనే.. కూతురు జ్ఞాపకాలు పదిలంగా ఉండాలని భావించి సరోజినీ దేవి 'ప్రత్యూష చారిటబుల్ ట్రస్ట్' ఏర్పాటు చేశారు. అనాథ ఆడబిడ్డలకు అండగా ఉండేందుకు.. మహిళా సాధికారత కోసం ఈ ట్రస్ట్ ద్వారా ఆమె ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారు. సినిమా ఇండస్ట్రీలో తన కూతురు ఎప్పటికీ గుర్తుండిపోయేలా ట్రస్ట్ ఆధ్వర్యంలో అవార్డులు కూడా ఇస్తున్నారు.